# మైనారిటీ నిరుద్యోగ యువతకు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు

## జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి నుశిత

**గద్వాల, వుదయం**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మైనారిటీ నిరుద్యోగ యువతకు విదేశాలలో వివిధ ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు.ఆస్ట్రేలియాలో వెల్డర్, స్ప్రే పెయింటర్, ప్యానెల్ బీటర్, కార్ మెకానిక్ వంటి ఉద్యోగాలతో పాటు ఒమన్ లో డైరెక్టర్ ఆఫ్ స్టడీస్ అండ్ డెలివరీ, చీఫ్ ప్రాజెక్ట్ అండ్ టెక్నికల్ ఆఫీసర్, క్లోత్ క్లీనర్, అగ్రికల్చర్ ఇంజనీర్, కొబ్బరి కోత కార్మికులు, కాంక్రీట్ 3D ప్రింటర్ ఆపరేటర్ పోస్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా జర్మనీలో రిజిస్టర్డ్ జనరల్ నర్స్, ట్రాన్స్‌మిషన్ లైన్ టెక్నీషియన్ ఉద్యోగాలు, ఖతర్ లో రిజిస్టర్డ్ నర్స్ (పురుషులు, మహిళలు) , హౌస్ కీపింగ్, వెయిటర్లు, కుక్స్, హోటల్ రిసెప్షనిస్ట్ (మహిళలు మాత్రమే) అలాగే గ్రీస్‌లో స్పా థెరపిస్ట్ (మహిళలు మాత్రమే), ఎలక్ట్రిషియన్, మెయింటెనెన్స్, ప్లంబర్, లైఫ్ గార్డ్స్, గార్డెనర్స్, క్లీనర్స్, డెలివరీ బాయ్స్, ఫిషర్‌మెన్ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత గల మైనారిటీ అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని రూమ్ నెంబర్ - 8, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని పని వేళలో సంప్రదించాలని కోరారు.

# క్రికెట్ బెట్టింగ్ లతో యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు..జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల, వుదయం**



ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో యువతను దారి తప్పించే క్రికెట్ బెట్టింగ్స్‌పై జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు గట్టిగా హెచ్చరించారు. తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు యువకులు ఈ అక్రమ కార్యకలాపాల వైపు ఆకర్షితులవుతున్నారని, ఇది వారి జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నదని పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్స్ కారణంగా యువత ఆర్థికంగా దెబ్బతిని, అప్పుల బారిన పడి, తీవ్ర నిరాశకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యల వరకు దారితీసే ప్రమాదం ఉందని, కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని స్పష్టం చేశారు. క్రికెట్ బెట్టింగ్ పూర్తిగా చట్ట విరుద్ధమని, ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. బెట్టింగ్ నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి మోసపూరిత మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రికెట్‌ను కేవలం వినోదంగా మాత్రమే చూడాలని, దానిని అక్రమ సంపాదనకు ఉపయోగించ కూడదని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు. మ్యాచ్‌ల సమయంలో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వెంటనే అప్రమత్తంగా ఉండాలని కోరారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ట్రైనీ కలెక్టర్ కు ఘన సత్కారం

**నారాయణపేట, వుదయం**



నారాయణపేట జిల్లా కు శిక్షణ కోసం వచ్చి తిరిగి వెళ్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ కు శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, జిల్లా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికి పూల మాల, పుష్ప గుచ్చాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ శిక్షణాకాలంలో ప్రణయ్ కుమార్ చూపిన నిబద్ధత, చిత్తశుద్ధిని కలెక్టర్ కొనియాడారు. ముఖ్యంగా నర్వ యాస్పిరేషన్ బ్లాక్ లో ప్రణయ్ కుమార్ చేపట్టిన కార్యక్రమాలు, కొత్త కొత్త ఆలోచనలతో అధికారులకు చేసిన దిశా నిర్దేశాలు అభినందనీయం అన్నారు. విభిన్న సంస్కృతి సంప్రదాయాలు, భాషలు కలిగిన జిల్లానే కాకుండా సీఎం జిల్లాలో పని చేయడం ప్రణయ్ కు భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. భవిష్యత్తులో ప్రణయ్ ఎక్కడ, ఏ స్థాయిలో ఉన్నా నారాయణ పేటను మరవద్దని కలెక్టర్ తెలిపారు. చివరగా ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల మాట్లాడుతూ నారాయణ పేట జిల్లాలో శిక్షణ పొందటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బదిలీపై వెళ్ళిన కలెక్టర్ సిక్తా పట్నాయక్, ప్రస్తుత కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్డీఓ, ఇతర అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ స్టాఫ్, పేషిస్టాఫ్ అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీధర్, సూపరింటెండెంట్ జయసుధ, డీపీ అర్వో రషీద్, ఈ.డి.ఎస్.సి.కార్పొరేషన్అబ్దుల్ ఖలీల్,డిటీ అఖిల ప్రసన్న, నర్వ తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, మక్తల్ తహసిల్దార్ సతీష్ కుమార్, కలెక్టరేట్లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యేసు క్రీస్తు ప్రేమ ను సమాజానికి చాటి చెప్పేదే రన్ ఫర్ జీసస్...

## టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి వుదయం**




ఈస్టర్ సందర్భం గా సంగారెడ్డి పట్టణం లో యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంగారెడ్డి పట్టణం లోని ఓల్డ్ బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుండి మొదలుకుని పోతీ రెడ్డి పల్లి చౌరస్తా వరకు అక్కడి నుండి సిఎస్ఐ చర్చ్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. కీర్తనలు పాడుతూ, నృత్యాలు చేస్తూ క్రీస్తును స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ యేసు పునరుత్థానం ను స్మరించుకుంటు , యేసు ప్రేమను ఈ సమాజానికి తెలుపడానికి రన్ ఫర్ జీసస్ దోహదపడుతుంది అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్ లతో పాటు యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం. నాయకులు .. రూబీన్ రెడ్డి, ప్రవీణ్, సునీల్ నిర్మల్ కుమార్, మధు మోహన్, సునీల్ జై కుమార్, పాస్టర్ లు రెవరెండ్ జార్జ్ ఎబినైసర్, రెవరెండ్ మధు కుమార్, రెవరెండ్ జాన్ పీటర్, సత్యానంద్, సత్య పాల్ పాల్గొన్నారు.

# ఇద్దరు దోపిడి దొంగలు అరెస్టు - రిమాండ్ కి తరలింపు

**వుదయం, సిద్దిపేట**




సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడి ఘటనకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బి.ఉపేందర్తెలిపిన వివరాల ప్రకారం గత నెల 29 న రాత్రి 9.30 గంటల సమయంలో కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతానికి చెందిన బల్ల సదానందం అనే వ్యక్తి కల్లు కాంపౌండ్ సమీపం నుండి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అతనిని మద్యం తాగుదామని నమ్మబలికి ఎవరూ లేని ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ అతనిపై దాడి చేసి, అతని వద్ద ఉన్న సెల్ ఫోన్, రూ.500 నగదు మరియు కాలికి ఉన్న వెండి కడియాన్ని దోచుకొని పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా అగుల్ల రాజు(44), సందమైన రాజు (32) లుగా గుర్తించామన్నారు. వారి నుండి బాధితుడి సెల్ ఫోన్, వెండి కడియాన్ని స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



**నారాయణపేట, వుదయం**

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ రషీద్ తెలిపారు. శనివారం నారాయణపేట 1 బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆకస్మిక తనికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయకాల ప్రార్థనలు పాల్గొని వంటగదిని పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం పారిశుద్ధ్యం మరుగుదొడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. అలాగే పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులకు తెలిపారు.
అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు.

# బొక్కలోనిపల్లి గ్రామంలో పర్యటించిన అదనపు కలెక్టర్



**మహబూబ్ నగర్ వుదయం**

మహబూబ్‌నగర్ రూరల్ మండలం లోని బొక్కలోనిపల్లి గ్రామంలో శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పర్యటించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా గ్రామం లో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్లు పనులు, ఉపాధి హామీ పథకం పనులను సమీక్షించారు. పనులను నాణ్యతతో నిర్వహిస్తూ, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.

# సిద్దిపేటలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**సిద్దిపేట, వుదయం**

భారత మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ పూజ్య బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను (ఆదివారం) జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎండి హమీద్ ఒక ప్రకటనలో తెలిపారు.
తేదీ: 05 ఏప్రిల్ 2026 (ఆదివారం) ఉదయం 10:00 గంటల కు బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా... సిద్ది పేట జిల్లా కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ అధికారిక వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఈ జయంతోత్సవ వేడుకల్లో జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు, దళిత సంఘాల నాయకులు, మేధావులు మరియు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, జగ్జీవన్ రామ్ కి ఘన నివాళులర్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని కోరారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు: జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి వుదయం**



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ లక్ష్యంగా రంగంపల్లి రోడ్డు, మార్కెట్యార్డ్, కునారం రోడ్డు, సుల్తానాబాద్ లోని వివిధ ప్రాంతాల వద్ద మీడియన్ ఓపెనింగ్ లను 10 రోజుల పాటు క్లోజ్ చేసి పరిశీలించాలని కలెక్టర్సూచించారు. రాంగ్ రూట్ ప్రయాణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున, వీటి నివారణకు సాంకేతిక పరిజ్ఞానం వాడుకోవాలని, రాంగ్ రూట్ లో ప్రయాణించే వాహనదారులకు భారీ జరిమానాలు విధించాలని అన్నారు. రహదారి పక్కన ఇటుక బట్టీల వద్ద వేగం నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. రాఘవపూర్, సబ్బితం గ్రామాల వద్ద మెయిన్ రోడ్డుకు జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. మంథని ఫ్లైఓవర్ వద్ద అవసరమైన చోట కాన్వెక్స్ మిర్రర్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ట్రాఫిక్ సిఐ రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమను పంచడమే యేసు తత్వంరన్ ఫర్ జీసస్'లో ఎమ్మెల్యే కవ్వంపల్లి

**కరీంనగర్ వుదయం**



మానవాళికి ప్రేమ పంచడమే యేసు క్రీస్తు తత్వమని మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం కరీంనగర్లో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సాటి మనిషికి సాయం చేయడం, పేదలను కనికరించడమే ఏసుక్రీస్తు తత్వమన్నారు. కరుణామయుడైన యేసు క్రీస్తు ప్రేమను ప్రపంచ మానవాళికి పంచాలన్నదే రన్ ఫర్ జీసస్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. క్రైస్తవ్యం మతం కాదని, అది ఒక సన్మార్గమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు."ఎంపీడీవో కుమారుని పెళ్లి ఎమ్మెల్యే హాజరు"తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) నాగపూర్ మల్హోత్రా - సుమలత దంపతుల పుత్రుడు ఆశిష్ మెమో వివాహానికి టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. హైదరాబాద్ లోని నిమ్మల కన్వెన్షన్ లో శనివారం జరిగిన ఈ వివాహ వేడుకకు డాక్టర్ కవ్వంపల్లి హాజరై నూతన వధూవరులను ఆశీస్సులు అందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి:

## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**సంగారెడ్డి వుదయం:**



ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) నియామకం చేపట్టాలని సూచించారు. ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రతినిధులను నియమించి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులు, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీ (డీఎస్ఈ) అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ఐడీ కార్డులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు, ఫారం-6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి తెలియజేశారు.అనంతరం కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లకు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేయాలని ప్రధాన రాజకీయ పార్టీలకు సూచించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియను సమగ్రంగా చేపట్టి ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వద్ద ఐటీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ఈఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి , సంగారెడ్డి తహసీల్దార్ జయరాం, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ స్కూల్లో జరిగిన దారుణ ఘటనపై నీచ రాజకీయాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి సలీం

**నారాయణపేట, వుదయం**



నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలో గత నాలుగు రోజుల క్రితం ఒక విద్యార్థిపై జరిగిన దారుణ ఘటనపై నిన్న (శుక్రవారం) బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని నారాయణపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్. సలీం శనివారం ఒక ప్రకటన లో విమర్శించారు.జరిగిన దారుణ ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా కండిస్తున్నామని, అలాగే బాధ్యుడైనా టీచర్ పై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారని,ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ కూడా చేశారని,కానీ బి.ఆర్.ఎస్ నాయకులు ఈ ఘటనను ఆసరాగా చేసుకొని రాజకీయ ఉనికిని చాటలానే ప్రయత్నం చేస్తున్నారన్నారు.బిఆర్ఎస్ నాయకులు విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ,వారికినిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ బాధిత విద్యార్థికి అవసరమైన వైద్య సహాయం అందించి, కుటుంబానికి అండగా నిలబడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. కానీ అలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం కెమెరాల ముందే బాధిత విద్యార్థి కి అయిన గాయలను ప్రదర్శన చేసి,కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆధారరహిత విమర్శలు చేయడం పూర్తిగా రాజకీయ నాటకమేనని విమర్శించారు.ప్రజలు తిరస్కరించిన కూడా బి.ఆర్.ఎస్ నాయకుల్లో ఇంకా మార్పు రావడం లేదని,కాలం చెల్లిన నాయకులతో కలిసి మీడియా దృష్టి ఆకర్షించే ప్రయత్నాలు చేయడం చూస్తుంటే, బాధితుడికి న్యాయం చేయాలనే ఉద్దేశం కంటే ఈ ఘటనను వారి రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవాలనే లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విమర్శలు చేయడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ గురుకుల పాఠశాలల విస్తరణ, నాణ్యమైన విద్య అందించడం,ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బలోపేతం, విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం పెంపు, మైనారిటీ వెల్ఫేర్ శాఖ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు,పేద ముస్లిం కుటుంబాలకు ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాల కల్పన వంటి పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.అలాగే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి కూడా నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ ల అభ్యున్నతికి కృషి చేస్తూ,వారికి విద్య,వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ న్నారని,అదేవిధంగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసలు సమస్యను పక్కన పెట్టి ప్రభుత్వం పై రాజకీయ విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆయన స్పష్టం చేశారు.బాధితుడి కన్నీళ్లను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే బిఆర్ఎస్ నాయకులకు వారి రాజకీయ కాలం చెల్లిపోయిందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు గట్టి తీర్పు ఇస్తారని మహమ్మద్ సలీం హెచ్చరించారు.

# ఈ నెల 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ

**వుదయం, మెదక్**



మెదక్ జిల్లాలో మొత్తం 520 రేషన్ దుకాణాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన మూడు నెలల (ఏప్రిల్, మే, జూన్) సన్న బియ్యం నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉంచి, నిరంతరంగా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న మూడు నెలల సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఈ నెల 30 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు ఎలాంటి తొందరపాటు లేకుండా సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు పొందవలసిందిగా కోరారు. జిల్లాలో ఎక్కడా సరుకుల కొరత లేదా పంపిణీ నిలిచిపోవడం వంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు.జిల్లా పరిపాలన తరఫున సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా పనిచేస్తూ, పారదర్శకంగా సకాలంలో సన్న బియ్యం సరఫరా జరిగేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మకుండా, గందరగోళానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఈ నెల 30వ తేదీ వరకు తమకు లభ్యమయ్యే మూడు నెలల రేషన్ సరుకులను పొందాలని విజ్ఞప్తి చేశారు. ఏవైనా సమస్యలు ఎదురైతే సమీప తహసీల్దార్ కార్యాలయం లేదా సంబంధిత పౌరసరఫరాల అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

# గజ్వేల్‌లో పొలిటికల్ హైటెన్షన్...

## కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి


## కార్యాలయంలోకి చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు..

## సీఎం రేవంత్ ఫోటో ఏర్పాటు

## విధ్వంసాన్ని ఖండించిన హరీష్ రావు..

## సోమవారం బంద్‌కు బీఆర్ఎస్ పిలుపు

**సిద్ధిపేట/గజ్వేల్, వుదయం**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో కార్యాలయం ఒక్కసారిగా రణరంగాన్ని తలపించింది. సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పోలీసుల కళ్లేదుటే కార్యాలయంలోకి చొచ్చుకెళ్లిన వారు, అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోని ఫర్నీచర్, కిటికీ అద్దాలు ధ్వంసమైనట్లు సమాచారం. "జై కాంగ్రెస్" అంటూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు అక్కడ హల్‌చల్ చేశాయి. ఇది ప్రభుత్వ ప్రేరేపిత దాడి హరీష్ రావు ఈ ఘటనపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే కాంగ్రెస్ 'గూండాలు' ఈ దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. పట్టపగలు ప్రజాప్రతినిధి కార్యాలయంపై దాడులు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన బీహార్ గ్యాంగులను తలపిస్తోందని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే వారి నోళ్లు మూయిస్తూ, దాడులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. శాంతియుత పోరాటానికి బీఆర్ఎస్ పిలుపు ఈ అరాచకానికి నిరసనగా సోమవారం నాడు 'గజ్వేల్ బంద్' నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, గాంధేయ మార్గంలో నిరసన తెలపాలని నాయకులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ శ్రేణుల తీరును నిరసిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# అరుదుగా దొరికే రక్తాన్ని దానం చేసిన జిపిఓ...

**మెట్ పల్లి వుదయం**



మెట్పల్లి పట్టణ కేశవ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన వర్షిణి అను మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం ఓ నెగటివ్ రక్తం ఎక్కించాలని డాక్టర్ చెప్పడంతో అరుదుగా దొరికే రక్తం కాబట్టి పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్bమల్లేష్ (మున్న) లను సంప్రదించగా గ్రామ పాలన అధికారుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు కోరుట్ల జిపిఓ గా విధులు నిర్వహిస్తున్న కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన ముద్దం రాకేష్కుమార్ కు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి రాకేష్ మెట్పల్లి పట్టణంలోని బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్త దానం చేశాడు అత్యవసర సమయంలో 11వ సారి రక్తదానం చేసి ప్రాణధాతగా నిలిచిన ముద్దం రాకేష్ ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్ మల్లేష్(మున్న) కేశవ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాయికృష్ణ రెవెన్యూ సిబ్బంది పేషెంట్ బంధువులు స్నేహితులు అభినందించారు.

# సొంత ఖర్చులతో 8వ వార్డులో వీధిలైట్లు వేసిన

## వైస్ చైర్మన్ మాల నర్సింహులు

**అలంపూర్, వుదయం**



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలోని 8వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహులు పలుచోట్ల తన సొంత ఖర్చులతో వీధిలైట్లను వేయించడం జరిగింది. రెండవ తేదీన వార్డు సభ నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు ప్రధాన సమస్యలైనటువంటి వీధిలైట్లు, డ్రైనేజీ, సిసి రోడ్డు పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్, వైస్ చైర్మన్ మాల నరసింహులు దృష్టికి తీసుకురావడంతో మున్సిపల్ చైర్మన్ ఆదేశానుసారం వైస్ చైర్మన్ తన సొంత ఖర్చులతో ప్రధాన కూడలలో పలుచోట్ల వీధిలైట్లు వేయించడం జరిగింది. అనంతరం వైస్ చైర్మన్ మాట్లాడుతూ 8వ వార్డులోని సమస్యలు ఇంకా ఏవైనా మిగిలి ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామేష్, గడిగ శేఖర్, నేష వెంకటేష్, మున్సిపాలిటీ సిబ్బంది లైన్మెన్ జయరాములు, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహా వరాహ పురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞ కరపత్ర ఆవిష్కరణ...



**కోరుట్ల, వుదయం**

కోరుట్ల పట్టణ వాసవి కళ్యాణ భవనంలో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అష్టాదశ పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞ పరంపరలో భాగంగా ఐదవ పురాణమైన శ్రీ మహా వరాహ పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞం కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ జ్ఞానయజ్ఞంలో ప్రసిద్ధ శృంగేరి ఆస్థాన పండితుడు పురాణ ప్రవర బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ ప్రవచనాలు అందించనున్నట్లు తెలిపారు. శ్రీ మహా వరాహ స్వామి మహిమ ధర్మ పరిరక్షణ భక్తి మార్గం వంటి విశిష్ట అంశాలపై ఆయన ప్రవచనాలు భక్తులను ఆధ్యాత్మికంగా ప్రేరేపిస్తాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 13 నుండి 19 వరకు ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల 30 నిమిషాల వరకు ఈ ప్రవచనాలు నిర్వహించబడతాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ ధార్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు భక్తులు సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని తమ మద్దతు తెలిపారు ఈ కార్యక్రమం ద్వారా సనాతన ధర్మ పరిరక్షణ తో పాటు యువతలో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించడమే లక్ష్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి తోపాటు పట్టణ ప్రముఖులు భక్తులు సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అగో జగ్గన్న అంటూ చిన్నారుల కేరింతలు..

## బస్సెక్కి ఆప్యాయంగా ముచ్చటించిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి, వుదయం**

పటాన్ చెరులో హృదయానికి హత్తుకునే సన్నివేశం చోటుచేసుకుంది. స్థానిక పెట్రోల్ బంకు వద్ద స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న చిన్నారులతో ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆప్యాయంగా ముచ్చటించారు. ఆయనను చూసిన వెంటనే "అగో జగ్గన్న" అంటూ పిల్లలు కేరింతలు కొట్టడం అక్కడి వాతావరణాన్ని ఆనందం తో నింపింది. ఈ సందర్భంగా పిల్లలతో సరదాగా మాట్లాడిన జగ్గారెడ్డి, "నేను మీకు ఎలా తెలుసు?" అని అడగగా, చిన్నారులు వెంటనే "మేము మీను రీల్స్‌లో చూస్తాం" అంటూ ఉత్సాహంగా సమాధానం ఇచ్చారు. "రీల్స్‌లో ఏం చూస్తారు?" అని ఆయన మళ్లీ ప్రశ్నించగా, "మీరు అందరికీ సహాయం చేసే వీడియోలు, రామ్ మందిర్‌లో భజనలు చేసే వీడియోలు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల వీడియోలు చూస్తాం" అంటూ పిల్లలు ఆనందంగా చెప్పారు.వెలిమెల, పాటి, పోచారం, ఇస్నాపూర్, పటాన్ చెరు ప్రాంతాలకు చెందిన ఈ చిన్నారులతో జగ్గారెడ్డి బస్సెక్కి మాట్లాడటం వారికి మరింత సంతోషాన్ని కలిగించింది. ఈ చిన్న సంఘటన అక్కడున్న వారందరికీ చిరునవ్వులు పంచింది.

# జగిత్యాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం...

### కేంద్రం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంది...
### రాష్ట్రం మద్దతు ధరకు ధాన్యాన్ని కొనడం వలన 10 వేల కోట్ల నష్టం భరించాల్సి వస్తుంది...
### జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

**జగిత్యాల, వుదయం**

తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆద్వర్యంలో జగిత్యాల వ్యవసాయ మార్కెట్ లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ప్రారంభించారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నా అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందని జిల్లాలో 46 వేల ఎకరాల్లో నియోజకవర్గంలో 14 వేల ఎకరాల్లో మొక్క జొన్న పంట సాగు చేశారని రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ను కోరగానే సానుకూలంగా స్పందించి మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయటం జరిగిందన్నారు కేంద్రం మద్దతు ధర 2400 గా పెట్టినా కేంద్రం మొక్క జొన్న కొనుగోలు చేయటం లేదని మొక్కజొన్న పంట కేంద్రం కొనుగోలు చేయాలి మద్దతు ధర అందజేయాలి కేంద్ర మద్దతు ధరకు తెలంగాణ రాష్ట్రం కొనుగోలు చేయడం తో తెలంగాణ మార్క్ ఫెడ్ 10వేల కోట్ల నష్టాల్లో ఉందని రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రైతులు ఒకే రకమైన వరి లాంటి పంట కాకుండా ఇతర పంటల సాగుపై మొగ్గు చూపాలని ఆయిల్ ఫామ్ పంట సాగు తో లాభదాయకం అన్నారు టన్ను కి 23 వేల తో రైతుకు లాభం కలుగుతుందన్నారు అంతర్ పంట గా కోకో పిట్ కూడా వేసుకోవచ్చునని ఫామ్ ఆయిల్ పంట సాగు తో ఫామ్ ఆయిల్ ధర నేడు బంగారం లా ఉందని ప్రపంచ మార్కెట్ లో రూపాయి విలువ తగ్గిందని మన దేశంలో 1 లక్ష కోట్ల ఆయిల్ దిగుమతులు జరుగుతున్నాయన్నారు రైతులు దేశానికి వెన్నెముక కాబట్టి రైతులు ఇతర పంటల సాగు పై ఆలోచన చేయాలని దేశం పై దిగుమతుల భారం తగ్గించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ మాజీ మార్కెట్ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి మార్కెటింగ్ ఏడి ప్రకాష్ డిఏఓ భాస్కర్ మార్క్ ఫెడ్ డిఎం హబిబ్ తహసిల్దార్ రామ్మోహన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అఖిల్ చిక్కుల భూమయ్య మహేశ్వర్ రావు బాలే శంకర్ సురేందర్ నాయక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు కౌన్సిలర్ లు సర్పంచులు నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు బస్సు సౌకర్యం కల్పించండి...

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్కు లేఖ రాసిన హనుమాండ్ల జయశ్రీ

**జగిత్యాల, వుదయం**



జగిత్యాల పట్టణానికి సంబంధించిన బడుగు బలహీనవర్గాల వారికి ఇండ్లు లేని నిరుపేదలకొరకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2008 సంవత్సరంలో స్థల సేకరణ చేసి అక్కడ 4 వేల మందికి ఒక్కొక్కరికి 70 గజాల స్థలాన్ని ఇస్తూ నిర్మాణం కొరకు 70 వేల రూపాయలు మంజూరి ఇచ్చే స్కీం ఉండేది ఈ స్థల సేకరణ మల్యాల మండల పరిధి లో గల నూకపెల్లి గ్రామంలో కొంత గవర్నమెంటు (ప్రభుత్వ) స్థలం ఉండగా మిగిలిన దానిని స్థలం కొనుగోలు చేసి పట్టాలు ఇవ్వగా అందులో కొంత మంది నిర్మాణం చేసుకున్నారు కాని తెలంగాణ ప్రభుత్వం వచ్చాక డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించాలని నిర్ణయించ అక్కడ నిర్మాణాలను చేసుకొనటువంటి లబ్దిదారుల స్థలాలను సేకరించి డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం మూడు ఫ్లోర్లతో నిర్మాణం చేపట్టారు. మళ్ళీ అక్కడ జగిత్యాల పట్టణానికి 4,520 ఇండ్లు మంజూరి ఇవ్వగా పూర్తి స్థాయిలో ఇండ్ల నిర్మాణం చేసి పట్టణ పరిధిలో నివసించే ఇల్లు లేని నిరుపేదలకు ప్రొసీడింగ్ మంజూరి చేసి ఇల్లు కేటాయించడం జరిగి దాదాపు 3 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికి అక్కడ పూర్తి స్థాయి రవాణా సౌకర్యం కల్పించలేకపోయారు. అధికారులు రవాణా సౌకర్యం అంటే బస్సు సౌకర్యం లేకపోవడంతో అక్కడి నుండి ప్రతి ఒక్కరు పని కొరకు జగిత్యాల పట్టణానికి రావాల్సిన పరిస్థితి ఈ నూకపెల్లి జగిత్యాల పట్టణం నుండి దాదాపు 7 నుండి 8 కిలోమీటర్ల దూరం మెయిన్ రోడ్డు నుండి డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్దకు లోపలకు 2 నుండి 3 కిలోమీటర్ల దూరం ఉండటం వల్ల రోజుకు ఆటో ఖర్చు దాదాపు ఒక్క కుటుంబానికి 200 రూపాయలు రావడానికి పోవడానికి అవుతున్నది దీని వల్ల ఆటో ఖర్చు నెలకు దాదాపు 5 వేల నుండి 6 వేల మధ్య ఖర్చు అవుతున్నందు వల్ల వారు మళ్ళీ పట్టణంలో కిరాయి ఉండడానికి మొగ్గు చూపుతున్నారు అక్కడ మొత్తం 4520 డబుల్ బెడ్రూం ఇండ్ల తోపాటు గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు దాదాపు 500 కుటుంబాలు వివిధ దశలలో నిలిచి పోయి ఉన్న 1611 ఇండ్లుకు సంబంధించిన వారు దాదాపు అన్ని కుటుంబాలు కలిపి 25 వేల మందికి రవాణా సౌకర్యం లేక చాల ఇబ్బంది పడుతున్నారు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు చాల సార్లు దరఖాస్తు ఇచ్చిన ఇప్పటి వరకు ఎటువంటి రవాణా వసతి కల్పించక పోవడంతో రవాణా శాఖ మంత్రి అయిన పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసు కెళ్లినట్లు హనుమాండ్ల జయశ్రీ తెలిపారు. ఇక్కడ నివసించే వారందరూ బడుగు బలహీనవర్గాల వారే పని చేసుకుంటే వచ్చిన డబ్బులతో రోజు గడిచే పరిస్థితి ఉన్న వారు కావున వీరికి ఆటో అనేది ఆర్థికంగా భారమవుతున్నది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన వీరికి ఆ ఫలం పొందే అవకాశం లేకుండా పోయింది. పిల్లలు స్కూళ్ళకు కాలేజీలకు పోవాలన్న ఆటోనే శరణ్యం కొన్ని సందర్భాలలో డబ్బులేక పిల్లలను స్కూల్లకు కాలేజ్ లకు పంపలేక ఇంటి వద్దనే ఉంచిన పరిస్థితులు కావున ఇక్కడ నివసించే ప్రజలందరి పైన మానవ తాదృకృదంతో ఆలోచించి జగిత్యాల పట్టణానికి సంబంధించిన డిపో మేనేజర్ తో మాట్లాడి జగిత్యాల నుండి నూకపెల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వరకు రోజుకు కనీసం 3సార్లు అయినా రవాణా అయ్యే విధంగా వెను వెంటనే ఆదేశాలు జారీ చేసి బస్సు సౌకర్యం కల్పించాలని ఇక్కడ ఉండే డబుల్ బెడ్రూం ఇండ్లు ఇందిరమ్మ ఇండ్ల లో నివసించే ప్రజలందరి పక్షాన నా మనవి చేస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ తెలిపారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ అవగాహనా కార్యక్రమం

**గద్వాల, వుదయం**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో ఈ రోజు మల్దకల్ మండల పరిధిలోని కుర్తి రావులచెరువు గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బాలల సంరక్షణ అధికారినరసింహులు హాజరై మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్ వంటి ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటి చట్టపరమైన పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా విద్యార్థులు, యువతకు సైబర్ నేరాల నుంచి ఎలా రక్షించుకోవాలి. సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం భద్రత పై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే చట్టబద్ధమైన దత్తత విధానం గురించి, అక్రమ దత్తత వల్ల కలిగే ప్రమాదాలు, ప్రభుత్వ నిబంధనలు వివరించబడినవి. సరైన చట్ట ప్రక్రియ ద్వారా దత్తత తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ఎక్సేంజ్ డిపార్ట్మెంట్ ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ డ్రగ్ నిర్మూలన అంశంపై యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాల గురించి తెలియజేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొడక్షన్ ఆఫీసర్ నరసింహ, ఎంఈఓ సురేష్, గ్రామ సర్పంచ్ భగవంత్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఎస్సై వెంకటేష, స్కూల్ హెచ్ఎం క్రాంతి కుమార్, ఈశ్వరయ్య, బాలల పరిరక్షణ పరిరక్షణ విభాగం ప్రతినిధి ప్రకాష్, జిల్లా ఉమెన్ ఎంప్లాయిమెంట్ సరోజ, 1098 లక్ష్మి , సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్స్, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో సీఎంర్ఫ్ చెక్కుల పంపిణీ – 127 మందికి రూ.33.49 లక్షల సహాయం

**సంగారెడ్డి వుదయం**



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంర్ఫ్ ) చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన కంది మండలం 17 మంది, కొండాపూర్ మండలం 27 మంది, సంగారెడ్డి టౌన్ 13 మంది, సంగారెడ్డి మండలం 6 మంది, ఇతర ప్రాంతాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1,72,200 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు సదాశివపేట పట్టణం మరియు మండలానికి చెందిన 44 మంది లబ్ధిదారులకు రూ.11,60,500 విలువైన చెక్కులు అందజేశారు. మొత్తంగా 127 మంది లబ్ధిదారులకు రూ.33,49,000 విలువైన CMRF చెక్కులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో రికార్డు స్థాయిలో CMRF సహాయం అందజేశామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని అన్నారు. మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం లేకపోయినా ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే సహకారంతో ఈ చెక్కుల పంపిణీ జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో రూ.60 వేల కంటే ఎక్కువ సహాయం అందడం లేదని, గతంలో లక్ష రూపాయల వరకు చెక్కులు ఇచ్చినట్లు తెలిపారు. అర్హులైన వారు నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ TNGOs రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, మాజీ ZPTC కొండల్ రెడ్డి, కొండాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, సంగారెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, మల్లాగౌడ్, శ్రీధర్ రెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ రఘు

**కోరుట్ల, వుదయం**



మల్లాపూర్ మండలం వివి రావు పేట గ్రామానికి చెందిన వేల్పుల రాజం గంగారాజుల కుమారుడు వివాహం రాయికల్ మండలం ఇట్యాలలో శనివారం జరగగా ఇట్టి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు ఈ కార్యక్రమంలో డాక్టర్ చిట్నేని రఘు తో పాటు రెండ్ల రాజన్న నల్ల వెంకటేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక...



**మెట్ పల్లి, వుదయం**

మెట్పల్లి పాత మున్సిపల్ కార్యాలయంలో అవుట్సోర్సింగ్ వర్కర్స్ అన్ని సెక్షన్ల కార్మికులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా లంక శ్రీకాంత్ ఉపాధ్యక్షులుగా ఉల్లెందుల శ్రీనివాస్ కార్యదర్శిగా అంతడుపుల అనిల్ సహాయ కార్యదర్శిగా లింగంపల్లి రజిత కోశాధికారి లంక సంజీవ్ కమిటీ సభ్యులుగా పి గంగాధర్ వి నరేష్ తాంద్ర సురేష్ ఎల్ మహేష్ ఎండి షాకిల్ టి నవీన్ మధురమ పొట్ట శేఖర్లను ఏకగ్రీవంగా ఎన్నుకొని శాలువాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కొత్త అధ్యక్ష కార్యదర్శులు నూతన కార్యవర్గానికి మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రి కమిషనర్ ఏఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం డి ఉస్మాన్ మున్సిపల్ సిబ్బంది కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు.

# వీర హనుమాన్ విజయాత్రలో గాయపడ్డ గుర్రాల రాజకుమార్...

### గుర్రాల రాజ్ కుమార్ కి ఆపరేషన్ చేయించిన డాక్టర్ వై అనుప్ రావు



**కోరుట్ల, వుదయం**

కోరుట్ల పట్టణంలో ఇటీవల జరిగిన వీర హనుమాన్ విజయ యాత్రలో ప్రమాదవశాత్తు గుర్రాల రాజకుమార్ కి ముక్కుపై బలమైన గాయం తగలగా వెంటనే స్పందించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై అనుప్ రావు రెనే హాస్పిటల్లో చికిత్స అందించి డాక్టర్ల సూచన మేరకు ఆపరేషన్ చేయాలని సూచించగా డాక్టర్ వై అనూప్ రావు వెంటనే కరీంనగర్ ప్రముఖ ఈ ఎన్ టి ఆసుపత్రిలో లేజర్ ఆపరేషన్ తన సొంత ఖర్చులతో (1లక్ష రూపాయలు) తో చేయించారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణ భజరంగ్దళ్ నాయకులు డాక్టర్ వై అనూప్ రావు ఆపరేషన్కు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ రాష్ట్ర ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ కౌన్సిలర్ ఇందూరి తిరుమల వాసు భారతీయ జనతా పార్టీ నాయకులు మాడవేణి నరేష్ సుదవేణి మహేష్ గిన్నెల శ్రీకాంత్ తులసి కృష్ణ బెక్కం అశోక్ బజరంగ్దళ్ నాయకులు కల్లెడ రోహిత్ పల్లికొండ వెంకటేష్ రాచకొండ చందు కళ్యాణ్ బజరంగ్దళ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్దండలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**వెల్దండ, వుదయం**

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్స్టేషన్లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా వెల్దండ టౌను, చౌకన్నపల్లి, కంటోని పల్లి కుప్పగండ్ల, స్టోన్ క్రషర్, కోట ) ఎక్స్ రోడ్ లలో నేడు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని మండల విద్యుత్ శాఖ అధికారి తెలిపారు.

# వైద్యాధికారుల పనితీరు మెరుగుపడాలి..జిల్లా కలెక్టర్

**గద్వాల వుదయం**




జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన వైద్య, ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తాను ఇటీవల జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు వివిధ సమస్యలను గుర్తించానన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పాత ఫైల్స్ క్లియరెన్స్, పనికిరాని ఫర్నిచర్ తొలగించాలని ఆదేశించినప్పటికీ చాలాచోట్ల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత మెడికల్ అధికారులు బాధ్యతాయుతంగా లేకుంటే తమ కిందిస్థాయి సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, లీవ్ లెటర్ రాయకుం డా విధులకు గైర్హాజరైతే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని పీహెచ్సీలు, ఇతర ప్రభుత్వఆసుపత్రిల్లో బయోమెట్రిక్ విధానంలో హాజరు తప్పనిసరి చేయాలని, యంత్రాల్లో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకుని వినియోగించాలన్నారు. ఆయా ఆసుపత్రుల్లోని వివిధ రిజిస్టర్ల నిర్వ హణ, వ్యాక్సినేషన్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయాఆసపత్రుల వైద్యాధికారులు తమ సమీపంలోని సబ్ సెంటర్స్కు, ఇతర క్యాంపులకు వెళ్లినప్పుడు ముందుగానే సంబంధిత రిజిస్టర్లో పేర్కొన్నాలన్నారు. ఎన్సిడి స్క్రీనింగ్ తో పాటు ఇతర కార్యక్రమాలన్నీ వంద శాతం విజయవంతం చేసేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగాల్సి ఉందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి వైద్య సేవ లకు చాలా మంది రోగులు కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం ఏముందని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.